# కళ్ళు తెరవండి!

లక్ష్మీప్రసన్న సిరంగి

"నమస్తే! పేరయ్యగారు రాలేదాండీ?"

"లేదు."

"ముందే వస్తా నన్నాడే..."

"ఇంతకీ..."

"సారీ, పరిచయం చేసుకోలేదుగా, మాది చిలుకలూరిపేట."

"ఆ... అలాగా. అయ్యో రామా నిలబెట్టి మాట్లాడుతున్నాను, క్షమించండి, దయచేసి ఇంట్లోకి వచ్చి కూర్చోండి."

"పర్వాలేదు, మీ రేం గాభరా పడకండి. పేరయ్య కేమొచ్చిందో మాయదారి రోగం, ఎంతకీ రావడం లేదు."

"కాస్త ముందూ వెనకా వస్తాడు. మీరేం కంగారు పడకండి. పూర్ణా! చిలుకలూరిపేట సంబంధం తాలుకు వచ్చారు. మానసను త్వరగా ముస్తాబు చేయి."

"అలాగే టిఫిన్ పంపించేదా?"

"నే తీసుకెళ్తా, అమ్మాయి చేత టీ పంపించు. వెళ్లటానికి హడావుడి పడుతున్నారు. ఆ పేరయ్య ఎక్కడ చచ్చాడో దరిద్రుడు!"

"అలాగే మీరు వెళ్లండి, పేరయ్యను తీరిగ్గా తిట్టొచ్చు."

"టిఫిన్ తీసుకోండి ముందు. అమ్మాయిని చూద్దురు గానీ."

"మర్యాదల కేమొచ్చింది లెండి! పేరయ్య ఉంటే మమ్మల్ని పరిచయం చేసేవాడు. దిక్కు దివాన లేదుగా వెధవ! వీడు మా అబ్బాయి. ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో సూపరువైజర్. మిగతా వారు వీడి స్నేహితులు."

"నమస్తే! అః లేవకండి. కూర్చోండి, బాబూ! టిఫిన్ తీసుకోండి. పేరయ్య చెప్పాడు లెండి మీ గురించి ఇదివరకే..."

"ఏవండీ! ఓసా రిలా వస్తారా?"

"ఆ వస్తున్న పూర్ణా! ఏంటి నీకు సాయంగా పక్కింటి, ఎదురింటి, వెనకింటి వాళ్లను పిలవకపోయావా?"

"ఇంకానా? అప్పుడే పట్టు చీరలతో, పట్టెడు నగలతో అబ్బాయి తల్లి వస్తుందని దొడ్డిదారి గుండా వచ్చారు. అమ్మాయిని ముస్తాబు చేస్తున్నారు."

"మరి పని గట్టుకుని న న్నెందుకు పిలిచావే?"

"ఇది మరీ బాగుంది, అత్తమీది కోపం దుత్తమీ దన్నట్లు, ఆ పేరయ్య రాకపోతే నామీద ఎగిరిపడాలా?"

"నీ వెధవ నస ఆపి విషయ మేంటో చెప్పి చావు."

"హవ్వా! శుభమాని పెళ్ళివా రొస్తే చావు మాటలు చెబుతారా నిండింట్లో? ఏదో ఈ ఒక్కదాని పెళ్లి చూసి చస్తాలెండి. మీ కోరిక తీరుతుంది. ఉట్టి గట్టుకు ఊరేగండి!"


"ఈ సంబడానికేనా కేకలేసి మరీ పిల్చింది. నీ వెధవ సొద అవుతావా? వెళ్లమంటావా?"

"మాటలు సరిగా రానివ్వండి, కేకలేసి ఎవరూ పిలవలేదు!"

"గుసగుసగా పిల్చావు. సరా? ఎందుకు పిల్చావో చెప్పి తగలడు."

"ఛీ! ఛీ! మీతో ఉండటం నా వల్లకాదు. పెళ్లిచూపులు కాగానే మా తమ్ముడి దగ్గరి కెళ్లిపోతా."

"తప్పకుండా కొన్ని రైజులైనా ప్రశాంతంగా బ్రతకవచ్చు, అమ్మాయికి టీ ఇచ్చి పంపించు.



వారు వెళ్లిపోతా మంటున్నారు. టాక్సీ కూడా వచ్చింది. నే పోతున్నా."

"కాస్త తల పైకెత్తి వెళ్లమ్మా మానసా! సిగ్గు తర్వాత. గడప తగిలి పడిపోగలవు."

"మీరు కూడా వెళ్లండి వదినా! అమ్మాయి భయపడుతుంది."

"వదమ్మా మానసా! టీ ఇచ్చి ఆ చాపపైన కూర్చుందువు గానీ."

"వూ ర్లొదినా! అబ్బాయి తల్లి ఎందుకు రాలేదుట?"

"ఏమో నమ్మా. మరోసారి వస్తుందిట."

"ప్చ్! ఒకరి కంటే ఒకరం డాబుగా కనిపించాలని మా కోడలి నగలు పెట్టుకొచ్చా న్నేను. ఆ సావిత్రమ్మ కూడా అంతే వదినా! అందరం అలాగే వచ్చాం గానీ, అసలైన ఆవిడే రాలేదాయె!"

"పోనీలేండి వదినా. అబ్బాయి బాగున్నాడా చూడండి."

"చాలా బాగున్నాడు. మానసను ఏమో అడుగుతున్నాడే ఆ కిటికీ దగ్గరగా పోయి విందాం రండి."

** ** **

"ఏరా అబ్బాయ్, అమ్మాయి నచ్చిందా? తర్వాత నన ధేనికి."

"అమ్మాయిని కొన్ని ప్రశ్న లడుగుతా మీ కేమైనా అభ్యంతరమా?"

"అబ్బే నీ ఇష్టం అడుగు బాబూ!"

"చూడండి మిస్... మీ పేరు...?"

"మానస!"

"స్వీట్ నేమ్. చదువు..."

"బి.కాం. ఫైన లియర్."

"అచ్చా... మీకు ఏ కళల్లో ప్రావీణ్యాం ఉంది?"

"సంగీతం నేర్చుకున్నా నాట్యంలో కాస్త ప్రావీణ్యాం ఉంది."

"వెరీ గుడ్ న న్నేమైన అడుగుతారా?"

"ఊహూ."

"వదమ్మా మానసా లోని కెళ్దాం."

"అమ్మాయి మాకు నచ్చిందండీ. కట్న కానుకలు పేరయ్య సమక్షంలో మాట్లాడుకుందాం. అతను వచ్చేట్టు లేదు. ఇక మేం వస్తామండి. లేవండిరా అబ్బాయిలూ!"

"ఆ మంచిదండి. అ దేంటి తోసుకుని లోపలి కెళుతున్నారు. అయ్యో వీధి తలుపులు వేయడం దేనికి? ఏం టిదంతా?

"ఎవరైన అరిచారో చంపేస్తాం! మా చేతుల్లో ఏమున్నాయో చూశారుగా? కత్తులు! ఎవరి నోట్లోంచైనా మాటొస్తే చేతిలోని కత్తితో వారి కుత్తుకలు కత్తిరించేస్తాం జాగ్రత్త! ఊ తీయండి మెడల్లోని నగలు!"

"అం... అ:... అంటే మీరు చిలకలూరిపేట పెళ్లివారు కాదా?"

"చిలుకలూరిపేటా లేదు చిల్లూరిపేటా లేదు, అంతా నటన! దారిలో పెళ్లిళ్ల పేరయ్య అసలు సంబంధంతో వస్తూ కనిపించాడు. వారి మాటలు విని వాళ్లను కట్టి పడేసి మేమొచ్చాం. సరా, ఇంకా వివరాలు కావాలా? తీయ్యండెహే నగలు!"

"రాగానే దేముకెళ్లక ఎనుబోతుల్లా తినడ మెందుకు, అమ్మాయిని చూడ్డ మెందుకురా దొంగవెధవల్లారా?"

"తెలివిమీరి మాట్లాడితే లేపేస్తాం! అయితే విను, రాగానే ఆకలి దంచేస్తూంది. టిఫిన్ తిన్నామా, ఇక ఆ పెళ్లిచూపుల థ్రిల్ కూడా పొందుదామని పిల్లను చూసి మా అవతారం ఎత్తాం."

"ఓరి మీ దుంపతెగ! ఇనపెట్టెలోని నగలన్నీ పెట్టుకొచ్చాం గదరా! ఓరి దేవుడో మా నగలు!"

"ఇవి నా కోడలు నగలు నాయనా! వదిలేయండి. చచ్చి మీ కడుపున పుడతా!"

"నేను వద్దనుకున్నారోయ్ దేవుడో! ఈ అనసూయమ్మ చేసింది. ఇంత కష్టపడి చేయించిన నగలు దొంగలకోసమేనా?"

"ఊ అరిస్తే పొడుస్తా! కోడలూ లేదు, కొండముచ్చూ లేదు. నగ లియ్యి! ఒరేయ్ బీరువా ఖాళీ చేశారా? టేపు రికార్డరు, రేడియో టాక్సీలో పడేయండి. ఏమైనా వదిలేశారేమో చూడండి, పోదాం!"

"గురూ మూట సిద్ధం పదండిక!"

"అందరూ వినండి జాగ్రత్తగా! మా గురించి ఏమైనా పోలీసులకు తెలిపారో, మీ నివాసం శ్మశానంలోనే! గుర్తుంచుకోండి. మరి కాసేపటికి చిలుకలూరిపేట వారితో పేరయ్య వస్తాడు. కళ్లు తెరిచి అసలు పెళ్లి చూపులకు తయారవ్వండి. పదరా! టాక్సీ పరిగెత్తించండి!" ●

